క్లుప్తంగా

ముమ్మరంగా వాహన తనిఖీలు



వాహన తనిఖీలు చేస్తున్న ఇన్‌చార్జి జనార్దనరావు, పోలీసులు

గజపతినగరం: ఎన్నికల విధుల్లో భాగంగా వాహన తనిఖీలను పోలీసులు ముమ్మరం చేశారు. గజపతినగరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఎస్ఎస్‌టీ టీమ్ ఇన్‌చార్జి జి.జనార్దనరావుతో కూడిన బృందం శనివారం సాయంత్రం వాహన తనిఖీలు చేపట్టింది. కార్యక్రమంలో హెచ్‌సీ బి.నాగరాజు, మహిళా కానిస్టేబుళ్లు కె.పైడితల్లి, కె.రామలక్ష్మి పాల్గొన్నారు.

బల్లంకిలో బైక్ ర్యాలీ

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బల్లంకి కనకరాజు, బొడ్డు శ్రీను తదితరుల నేతృత్వంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. బల్లంకి, బానాది ఎం.శింగవరం గ్రామాల్లో జై జగన్ జై జగన్ అంటూ సీఎంగా జగన్‌కు ఆశీర్వదించాలని నినాదాలు చేస్తూ ర్యాలీలో పాల్గొన్నారు.

ఆ పత్రికల్లో తప్పుడు రాతలను నమ్మొద్దు

- పెదకాద ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య



పెదకాద గ్రామంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య



హాజరైన గ్రామస్తులు

దత్తిరాజేరు: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ఆదరణ తట్టుకోలేక చంద్రబాబుకు కొమ్ముకాస్తూ ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో ప్రచురితమవుతున్న తప్పుడు వార్తలను నమ్మొద్దని ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. పెదకాద గ్రామంలో ఎన్నికల ముగింపు సందర్భంగా శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని చూసి టీడీపీ నాయకులు ఓర్వలేక పోతున్నారన్నారు. విద్యాదీవెన, చేయూత వంటి సంక్షేమ పథకాలు అందకుండా కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారన్నారు. ప్రతి ఒక్కరూ మే 13వ తేదీన ఫ్యాన్ గుర్తుకు ఓటేసి టీడీపీ నాయకుల చెత్త రాజకీయాలకు చరమగీతం పాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నాగిరెడ్డి సత్యం, ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు, సచివాలయ కన్వీనర్ సారెడ్డి కుమార్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ సజావుగా కొనసాగాలి

- ఎన్నికల అధికారి హానీష్ చాబ్రా



ఎన్నికల సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్వో, ఎన్నికల అధికారులు

గజపతినగరం రూరల్: ఈ నెల 13న జరగనున్న అసెంబ్లీ, లోక్‌సభ, సాధారణ ఎన్నికల పోలింగ్ సజావుగా కొనసాగేలా ఏర్పాట్లు పూర్తి చేశామని, సిబ్బంది అంతా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి పోలింగ్‌ను విజయవంతం చేయాలని ఎన్నికల ప్రత్యేక అధికారి హానీష్‌చాబ్రా కోరారు. పోలింగ్ సామగ్రి తరలింపునకు తగినన్ని బస్సులను ఏర్పాటుచేస్తామన్నారు. ఆర్వో సూర్యకళ మాట్లాడుతూ విధుల్లో అలసత్వం వహించిన వారిపై వేటు తప్పదన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమేష, ఆయా ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు పూర్తి

- అల్లర్లకు పాల్పడవద్దు
- రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ



ఎస్.కోట ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ

శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలని శృంగవరపుకోట నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.మురళీకృష్ణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం ఆయన ఎన్నికల ఏర్పాట్లపై 'సాక్షి'తో మాట్లాడుతూ నియోజకవర్గం పరిధిలోని ఐదు మండలాల్లో 270 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, ప్రతి బూత్‌లో మంచినీరు, మరుగుదొడ్లు, విద్యుత్, ఇంటర్‌నెట్ వంటి అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఒక్కో బూత్‌లో పీఓ, ఏపీఓ, నలుగురు ఓపీఓలు, బీఎల్‌ఓలు విధులు నిర్వహిస్తారన్నారు. క్రిటికల్ పోలింగ్ స్టేషన్లుగా 51 లొకేషన్లను గుర్తించామని వాటి వద్ద మైక్రో అబ్జర్వర్లు ఉంటారని చెప్పారు. 34 రూట్లుగా నియోజకవర్గాన్ని విభజించామని, వాటిలో ధారపర్తికి ప్రత్యేకంగా ఒక రూట్ కేటాయించామన్నారు. ప్రతి రూట్‌కు ఒక రూట్‌ఆఫీసర్, సెక్టార్ ఆఫీసర్, ఒక పోలీస్ అధికారి భాధ్యులుగా ఉన్నారన్నారు. ప్రస్తుతం 144వ సెక్షన్ అమలులో ఉందని, ఎక్కడ అల్లర్లకు పాల్పడినా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారని, ఎటువంటి ప్రచార ఆర్భాటాలు, మైక్‌సెట్‌లు, ఊరేగింపులు లేకుండా, ఐదుగురికి మించకుండా ఇళ్లకు వెళ్లి ప్రచారం చేసుకోవచ్చని సూచించారు. పోలింగ్ వేళ ప్రతి రెండు గంటలకు ఓటింగ్ సరళి, పోలింగ్ వివరాలు స్థానిక ఆర్‌ఓ కార్యాలయం వద్ద తెలియజేస్తామన్నారు. ఆదివారం ఉదయం 6గంటల నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్ కౌంటర్లు పనిచేస్తాయని, ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలని అన్ని పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజలను కోరుతున్నామన్నారు.

'మందు'జాగ్రత్త

- వైన్ షాపుల ముందు బారులు తీరిన మందు బాబులు

వేపాడ: సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా శనివారం సాయంత్రం నుంచి వైన్ షాపులు మూతపడనుండడంతో మండుటెండను లెక్కచేయకుండా మందు బాబులు వైన్‌షాపులవద్ద బారులు తీరారు. 48 గంటల పాటు మద్యం దుకాణాలు తెరవరని తెలుసుకుని, అవసరమైన మందును స్టాకు చేసుకునేందుకు మందుబాబులు ముందు జాగ్రత్తగా షాపుల వద్ద బారులు తీరారు. బారులు తీరడంతో పాటు తోపులాట జరగడంతో వల్లంపూడి ఎస్సై రాజేష్ వైన్ షాపువద్ద జాగ్రత్తలు తీసుకున్నారు.